సంపుటి :02 సంచిక :188 పేజీలు :06 వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com Voice of the people

శుక్రవారం 19 , సెప్టెంబర్ 2025



## ఇసుక అక్రమ రవాణాపై కాంగ్రెస్ ధర్నా

- నా ప్రభుత్వం నన్ను క్షమించాలి... కోటగిరి సతీష్
- పక్క వాళ్లపై కేసులు పరాయి వాళ్ళపై ప్రేమలు

03



## స్పీకర్ నోటీసులకు జవాబిస్తా

- ఆ తర్వాత భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తా..
- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

05

## వంతెన పనుల్లో వేగం పెంచాలి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- కాజీపేట ఆర్ఓబీ పనుల పరిశీలన

05



## బీసీలకు ఆ మూడు పార్టీలు మోసం

- బీసీలకు బడ్జెట్ లో రూ.లక్ష కోట్లు కేటాయించాలి
- టీఆర్పీ రాష్ట్ర అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న
- టీఆర్పీ వరంగల్ డిక్లరేషన్ విడుదల

05





## వరంగల్‌లో జోయాలుక్కాస్ గ్రాండ్ గా బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో

వరంగల్‌లోని జోయాలుక్కాస్ షోరూంలో 'బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో' ప్రారంభమైంది. అక్టోబర్ 5 వరకు కొనసాగే ఈ ప్రదర్శనలో వజ్రాలు, అరుదైన ఆభరణాల సేకరణలు అందుబాటులో ఉన్నాయి. ప్రారంభ ఆఫర్‌గా ఆభరణాల తయారీ ఛార్జీలపై 50 శాతం తగ్గింపును అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నతాధికారులు, జోయాలుక్కాస్ సిబ్బంది, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

– అక్షర దర్బార్, వరంగల్

05

## దొంగ.. దొంగా!

### ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరుస చోరీలు

- నెల్లికుదురులో వృద్ధురాలి హత్య.. నగలు అపహరణ
- పలుచోట్ల తాళం వేసిన ఇళ్లలో దొంగతనాలు
- తాళం వేసిన ఇండ్లే దుండగలు టార్గెట్

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరుసగా జరుగుతున్న చోరీలు ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. వృద్ధులను లక్ష్యంగా చేసుకొని దుండగులు వారిపై దాడులకు తెగబడుతున్నారు. వారి మెడలోని బంగారు ఆభరణాలను దోచుకుంటున్నారు. కొద్ది రోజుల క్రితం మహబూబాబాద్ జిల్లాలో నగల కోసం 80 ఏళ్ల వృద్ధురాలిని హత్య చేసి బావిలో పడేసిన దారుణ ఘటన కలకలం సృష్టించింది. తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసి, పగలు రాత్రి అనే తేడా లేకుండా దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో, పోలీసులు కఠిన చర్యలు చేపడుతూ, నిందితులపై పీడీ యాక్టు కేసులు నమోదు చేస్తున్నారు.

- అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి

02





## మావోయిస్టు ఉద్యమం పయనమెటు?

03

- పార్టీ చీఫ్ కమాండర్ గా ఇటీవల తిరుపతి బాధ్యతలు
- వరుస ఎన్‌కౌంటర్లతో పార్టీ ఉక్కిరి బిక్కిరి
- అభయ్ పేరిట తాజాగా లేఖ విడుదల.. శాంతి చర్చల ప్రతిపాదన
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి స్పందన కరువు
- 2026 మార్చి 31లోపు పార్టీని అంతం చేస్తామని కేంద్రం ప్రతిన
- 'ఆపరేషన్ కగార్'లో వందలాది మంది హతం

### తుపాకీ వదిలేది లేదు..

మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ



03

దేశంలో మావోయిస్టు ఉద్యమం పయనమెటు? వరుస ఎన్‌కౌంటర్లతో ఉక్కిరిబిక్కిరైన మావోయిస్టు పార్టీ, శాంతి చర్చలకు సిద్ధమని తాజాగా ప్రకటించడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. పార్టీ అధికార ప్రతినిధి 'అభయ్' పేరుతో విడుదలైన లేఖలో ఆయుధాలను పక్కన పెట్టి, ప్రభుత్వంతో చర్చలకు సిద్ధంగా ఉన్నామని పేర్కొనడం గమనార్హం. పార్టీ కొత్త చీఫ్ కమాండర్‌గా తిప్పర్తి తిరుపతి బాధ్యతలు చేపట్టిన తర్వాతే ఈ పరిణామాలు చోటు చేసుకున్నాయి. అయితే, ఈ ప్రతిపాదనలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎలాంటి స్పందన రాకపోవడం గమనార్హం. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ కగార్' మావోయిస్టు ఉద్యమాన్ని తీవ్రంగా దెబ్బ తీసింది. దీంతో మావోయిస్టుల సంఖ్య 1,500-2,000కి తగ్గిపోయిందని నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి.

- అక్షర దర్బార్ ప్రధాన ప్రతినిధి

# డాక్టర్ అశోక్ కు గుజరాత్ లో ఘన సన్మానం



అక్షర దర్బార్, మహబూబాబాద్ : ప్రతి ఎక్స్‌ప్రెస్ రైలులో నాలుగు జనరల్ బోగీలు సాధించిన ఉద్యమకారుడు, సాధన సమితి జాతీయ కన్వీనర్ డాక్టర్ పరికిపండ్ల అశోక్‌కు గుజరాత్‌లో ఘన సన్మానం జరిగింది. ప్రధానమంత్రికి కోటి ఉత్తరాల ఉద్యమం ద్వారా దేశవ్యాప్తంగా ప్రయాణికులను చైతన్యవంతం చేసి, ప్రతి ఎక్స్‌ప్రెస్ రైలులో నాలుగు జనరల్ బోగీలు ఉండేలా కృషి చేసినందుకు ఆయనను ప్రశంసించారు. గత 20 ఏళ్లుగా ఆత్మహత్యల నివారణపై చైతన్యం కల్పిస్తూ ఇప్పటివరకు 28 మందిని కాపాడటం, కరోనా సమయంలో 33 జిల్లాల్లో బైక్ యాత్ర చేసి ఉచితంగా హోమియోపతి మందులు పంపిణీ చేయడాన్ని వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సూరత్ కార్పొరేటర్ జీతూ వచ్చాని, తుమ్మ రమేష్, సంజయ్ వచ్చాని, కైలాస్ భాయ్ హకీమ్, విక్రం పురోహిత్, మన్ను పాటకీర్, అజిత్ మెగావత్, అల్పేష్ రాచారి, అశోక్ భాయ్, జక్కాని సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# టీయూఎఫ్ కోఆర్డినేటర్ గా తుడుం వెంకటేష్



అక్షర దర్బార్ శాయంపేట : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాస్ , వర్కింగ్ ప్రెసిడెంట్ నందగిరి రజినీకాంత్ ల ఆదేశం మేరకు హనుమకొండ జిల్లా కోఆర్డినేటర్ గా తుడుం వెంకటేష్ ను టీయుఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు పొడిశెట్టి గణేష్ నియమించి నియామక పత్రం అందజేశారు. తెలంగాణ ఉద్యమకారుల కు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టియుఎఫ్ హనుమకొండ జిల్లా యూత్ అధ్యక్షులు కొమ్ముల శివ, శాయంపేట టౌన్ అధ్యక్షులు రంగు మహేందర్, జిల్లా ఉపాధ్యక్షులు పల్లెబోయిన సారయ్య, యూత్ నాయకులు బెరుగు రాకేష్, పెంబర్తి వినయ్, నాయకులు ఎర్ర తిరుపతిరెడ్డి , తుమ్మ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



# దొంగ.. దొంగా..!

**ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరుస చోరీలు**

- నెల్లికుదురులో వృద్ధురాలి హత్య.. నగలు అపహరణ
- పలుచోట్ల తాళం వేసిన ఇళ్లలో దొంగతనాలు
- తాళం వేసిన ఇండ్లే దుండగలు టార్గెట్

**ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరుసగా జరుగుతున్న చోరీలు ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. వృద్ధులను లక్ష్యంగా చేసుకొని దుండగులు వారిపై దాడులకు తెగబడుతున్నారు. వారి మెడ లోని బంగారు ఆభరణాలను దోచుకుంటున్నారు. కొద్ది రోజుల క్రితం మహబూబాబాద్ జిల్లాలో నగల కోసం 80 ఏళ్ల వృద్ధురాలిని హత్య చేసి బావిలో పడేసిన దారుణ ఘటన కలకలం సృష్టించింది. తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసి, పగలు రాత్రి అనే తేడా లేకుండా దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో, పోలీసులు కఠిన చర్యలు చేపడుతూ, నిందితులపై పీడీ యాక్టు కేసులు నమోదు చేస్తున్నారు.**



**అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి :**

ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొద్దిరోజులుగా వరుస చోరీలు జరుగుతున్నాయి. బంగారు ఆభరణాల కోసం దుండగులు వృద్ధులపై దాడులు చేస్తున్నారు. హత్యలు జరుగుతున్నాయి. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురుకు చెందిన రాధమ్మ అనే 80 ఏళ్ల వృద్ధురాలిని దుండగులు బంగారు నగల కోసం హత్య చేసి, ఆమె మృతదేహాన్ని పక్కనే ఉన్న బావిలో పడేశారు. రాధమ్మ ఒంటిపై ఉన్న బంగారు గాజులు దోచుకోవాలనే దురుద్దేశంతోనే దుండగులు ఈ దారుణానికి ఒడిగట్టారని ఒకవైపు, ఆమె మంత్రగత్తె అన్న అనుమానంతోనూ హతమార్చి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. అలాగే ఇటీవల కాలంలో చైన్ స్నాచింగ్, ఇళ్లలో దొంగతనాలు సైతం పెరిగి పోయాయి.

**- తాళం వేసిన ఇండ్లే లక్ష్యం..**

దుండగులు తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారు. కుటుంబ సభ్యులు వేరే ప్రాంతాలకు వెళ్లినప్పుడు, దొంగలు ఆ ఇంటిని టార్గెట్ చేసి తాళాలు పగులగొట్టి ఇంట్లోకి చొరబడుతున్నారు. ఇంట్లోని విలువైన ఆభరణాలు, నగదను అపహరించి ఉడాయిస్తున్నారు. పర్వతగిరి, దమ్మన్నపేట ప్రాంతాల్లో ఇటీవల ఇండ్లలో జరిగిన చోరీల స్థానికులకు కునుకు లేకుండా చేస్తున్నాయి. మార్చి 13న హనుమకొండలోని గోపాలపూర్ భద్రకాళి నగర్‌లో మార్చి 13న అర్ధరాత్రి ఒకేసారి నాలుగు ఇళ్లలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఏడాది ప్రారంభంలో ఎనుమాముల, గీసుకొండ, దామెర, బొడ్డు చింతలపల్లి గ్రామాల్లో తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని వరుస చోరీలకు పాల్పడ్డారు. దుండగులు పగలు, రాత్రీ అనే తేడాలేకుండా చోరీలకు పాల్పడుతున్నారు. వరుస చోరీల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కుటుంబంతో కలిసి ఊళ్లకు వెళ్లేటప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలని ,ఇంటి చుట్టపక్కల వారిని గమనిస్తూ ఉండమని చెప్పాలని పోలీసులు సూచిస్తున్నారు.

**- పీడీ యాక్టు నమోదు..**

నేరాలు, చోరీలనుకట్టడి చేసేందుకు పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. నిందితులపై ఉక్కుపాదం మోపుతున్నారు. దొంగతనాలకు పాల్పడిన వ్యక్తులపై పీడీ యాక్టు కేసులు కూడా నమోదు చేస్తున్నారు. దీనిలో భాగంగానే ఇటీవల భూపాలపల్లి జిల్లా గణపురానికి చెందిన దురిశెట్టి నిరంజన్ అనే పాత నేరస్తుడిపై పీడీయాక్ట్ నమోదు చేశారు. కాలనీలు, గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచిస్తున్నారు.



# గంజాయి రవాణాదారుల అరెస్ట్..!

- వివరాలు వెల్లడించిన కాటారం డీఎస్పీ సూర్యనారాయణ
- నిందితులను రిమాండ్ కు తరలింపు

అక్షర దర్బార్, కాటారం :నిషేధిత గంజాయి రవాణా చేసి అమ్మకం, కొనుగోలు చేస్తున్న నలుగురు వ్యక్తులని పట్టుకున్నట్లు కాటారం డీఎస్పీ సూర్యనారాయణ తెలిపారు. శుక్రవారం డీఎస్పీ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి నిందితుల వివరాలను వెల్లడించారు. మల్హర్ మండలంలోని కొయ్యూరు, కొండంపేట గ్రామాలకు చెందిన యాదండ్ల నవదీప్, కంపల్ల సాయి అనే యువకులు జల్సాలకు అలవాటు పడి డబ్బుల కోసం నిషేధిత గంజాయి విక్రయాలకు పూనుకున్నారు. దీంతో ఒరిస్సా రాష్ట్రంలోని మోటు అనే గ్రామానికి వెళ్లి నిషేధిత గంజాయిని తీసుకొచ్చి మల్హర్ మండలంలోని వారికి తెలిసిన పరిచయస్తులకు గత కొన్నాళ్లు నుండి విక్రయిస్తున్నారు. శుక్రవారం గట్టుపల్లి లోని ప్రభుత్వ పాఠశాల వద్ద అదే మండలంలోని మల్లారం గ్రామానికి చెందిన భూక్య రాజు, ఎండీ అజారుద్దీన్ అనే యువకులకు నిషేధిత గంజాయిని విక్రయిస్తున్నారని పక్కా సమాచారం కొయ్యూరు పోలీసులకు అందగా అక్కడికి చేరుకొని నలుగురిని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నట్లు డీఎస్పీ వెల్లడించారు.వారి వద్ద నుండి సుమారు 1.230 గ్రాముల గంజాయి పట్టుకున్నామని దాని విలువ రూ.61వేల ఐదు వందలు ఉంటుందని డీఎస్పి పేర్కొన్నారు.

# టఫ్ యాత్రను విజయవంతం చేయండి

అక్షర దర్బార్, నల్లబెల్లి: నల్లబెల్లి గ్రామపంచాయతీ ఆవరణలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల కమిటీ అధ్యక్షుడు తంగెళ్ల భాస్కర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఉద్యమకారులకు 250 గజాల ఇల్లు స్థలం, నెలకు ₹25 వేల పెన్షన్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ఉద్యమకారుల ఆర్థిక ఇబ్బందులు, వయోభారం దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆదుకోవాలని కోరారు. ఈ నెల 21న రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ నల్లబెల్లి మండల కేంద్రానికి రానున్న సందర్భంగా జరగబోయే టఫ్ బస్సు యాత్రను విజయవంతం చేయాలని ప్రజలను పిలుపునిచ్చారు. సమావేశంలో ఫోరం జిల్లా కన్వీనర్ గుబ రాజు, జిల్లా కార్యదర్శి బట్టు సాంబయ్య, మండల కోశాధికారి ఓదెల రవి, ఉపాధ్యక్షుడు కొత్తగట్టు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



# శాయంపేట తహసీల్దార్ గా ప్రవీణ్

అక్షర దర్బార్ శాయంపేట : శాయంపేట మండల నూతన తహసీల్దార్‌గా ఆర్. ప్రవీణ్ కుమార్ ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ ప్రభావతి,రెవెన్యూ సిబ్బంది ఆయనకు బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ బదిలీ పై వెళ్లారు.

# గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రధాన లక్ష్యం

**నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి**



అక్షరదర్బార్ ,ఖానాపురం : ఖానాపురం మండలం చిలకమ్మానగర్ గ్రామ నూతన గ్రామపంచాయతీ శుక్రవారం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రారంభించారు. ఇటీవల నూతనంగా ఏర్పాటున గ్రామపంచాయతీ భవనాన్ని20 లక్షలతో నిర్మించగా స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే దొంతి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు రానున్న మూడేళ్లలో ఇందిరమ్మ రాజ్యం తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు అర్హులైన ప్రజలందరికీ అన్ని సంక్షేమ పథకాలను దశలవారీగా అందించి ప్రజల ఆదరణను పొందుతామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల నాయకులు గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు

## ఇసుక అక్రమ రవాణాపై కాంగ్రెస్ శ్రేణుల ధర్నా



అక్షర దర్బార్, టేకుమట్ల: టేకుమట్లలో ఇసుక అక్రమ రవాణాకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా జరిగింది. మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్ గౌడ్ మాట్లాడుతూ "నా ప్రభుత్వం నన్ను మన్నించాలి... కానీ ఇసుక మాఫియాను క్షమించకూడదు" అని మండిపడ్డారు. ఇందిరమ్మ ఇళ్ల పేరిట వందల ట్రిప్పుల ఇసుకను దళారులు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని ఆరోపించారు. మండలానికి 30 ట్రాక్టర్ల అనుమతి ఉండగా రోజూ 200–300 ట్రాక్టర్ల ద్వారా ఇసుక దోపిడీ జరుగుతోందని విమర్శించారు. అక్రమ రవాణాను అరికట్టాలని కోరుతూ తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు.

## 'ఆదర్శ'లో అలరించిన దసరా, బతుకమ్మ సంబరాలు

### *ఆకట్టుకున్న ఆదికావ్యం రామాయణ ప్రదర్శన




అక్షర దర్బార్, కాటారం: కాటారం ఆదర్శ హైస్కూల్‌లో బతుకమ్మ, దసరా సంబరాలు వైభవంగా జరిగాయి. విద్యార్థులు రామాయణంలోని దృశ్యాలను ప్రదర్శించగా, రావణాసురుడి దహనం, బాణసంచా ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథులుగా హాజరైన మార్కెట్ కమిటీ చైర్మన్ పంతకాని తిరుమలసమ్మయ్య, పాఠశాల చైర్మన్ జనగామ కరుణాకర్ రావు బతుకమ్మ తెలంగాణ సంస్కృతి ప్రతీక అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ జనగామ కార్తీక్ రావు, ప్రిన్సిపాల్ జనగామ కృషిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





# మావోయిస్టు ఉద్యమం పయనమెటు?

- పార్టీ చీఫ్ కమాండర్ గా ఇటీవల తిరుపతి బాధ్యతలు
- వరుస ఎన్కౌంటర్లతో పార్టీ ఉక్కిరి బిక్కిరి
- అభయ్ పేరిట తాజాగా లేఖ విడుదల.. శాంతి చర్చల ప్రతిపాదన
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి స్పందన కరువు
- 2026 మార్చి 31లోపు పార్టీని అంతం చేస్తామని కేంద్రం ప్రతిన
- 'ఆపరేషన్ కగార్'లో వందలాది మంది హతం

**అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి :** మావోయిస్టు పార్టీ తాత్కాలికంగా ఆయుధాలు పక్కన పెడుతుందని, ప్రభుత్వంతో శాంతి చర్చలకు సిద్ధంగా ఉందని ఆ పార్టీ అధికార ప్రతినిధి అభయ్ పేరుతో విడుదలైన లేఖ ప్రస్తుతం చర్చనీయాంశమైంది. ప్రపంచంలో మారిన పరిస్థితుల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామనేది ప్రకటన సారాంశం. మావోయిస్టు పార్టీ చీఫ్ కమాండర్గా తిప్పర్తి తిరుపతి బాధ్యతలు చేపట్టిన తర్వాత తాజాగా ఛత్తీస్గఢ్లో ఒక ఎన్కౌంటర్ జరిగింది. కాల్పుల్లో ఒడిశా కేడర్కు చెందిన కీలక నేత మోడెం బాలకృష్ణ మృతిచెందాడు. ఈ పరిణామాల తర్వాత పార్టీ నుంచి లేఖ విడుదలైంది. పార్టీ కొత్త చీఫ్తో చర్చల తర్వాత పార్టీలో సాయుధ పంథాపై చర్చ జరిగినట్లు తెలుస్తున్నది. ఏది ఏమైనప్పటికీ వరుస ఎన్‌కౌంటర్లతో మావోయిస్టు పార్టీ బలహీనపడిందన్నది వాస్తవం. ఒకప్పుడు వేలల్లో ఉన్న మావోయిస్టుల సంఖ్య ఇప్పుడు దేశవ్యాప్తంగా 1,500– 2,000 మందికి తగ్గిపోయిందని నిఘా వర్గాల అంచనా. దీంతో మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి అభయ్ ఆయుధాలు విడిచిపెట్టి, చర్చలకు సిద్ధమని ప్రకటించే పరిస్థితి వచ్చింది. ఒకప్పుడు బెంగాల్, జార్ఖండ్, ఒడిశా, ఏపీ, తెలంగాణ మీదుగా ఉన్న అటవీ ప్రాంతం 'రెడ్ కారిడార్' గా పేరు గాంచిన ప్రాంతాలన్నీ ఇప్పుడు దేశంలో కొన్ని జిల్లాలకే పరిమితమైంది. 2026 మార్చి నాటికి నక్సలిజాన్ని దేశం నుంచి పూర్తిగా నిర్మూలించాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలుస్తున్నది.

### - 200మందికిపైగా మృతి..

దేశంలో మావోయిస్టు ఉద్యమాన్ని అరికట్టే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ కగార్' మావోయిస్టు పార్టీని కోలుకోలేని దెబ్బ తీసింది. 2023లో ప్రారంభమైన ఆ ఆపరేషన్ మావోయిస్టులకు కంచుకోటగా భావించే ఛత్తీస్‌గఢ్ దండకారణ్యాన్ని టార్గెట్ చేసింది. పారామిలిటరీ దళాలైన సీఆర్పీఎఫ్, బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్, స్పెషల్ టాస్క్ ఫోర్స్, డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్స్ సాయంతో పోలీసు అధికారులు అటవీ ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నారు. అధికారిక లెక్కల ప్రకారం ఇప్పటివరకు 200 మందికి పైగా మావోయిస్టులు ఎన్‌కౌంటర్లలో మరణించారు. ఈ ఏడాది గరియాబంద్ ఎన్‌కౌంటర్‌లో కేంద్ర కమిటీ సభ్యుడు చలపతి (జైరామ్) మృతి చెందాడు.

### - కర్రెగుట్టల్లో 21 రోజుల ఆపరేషన్..

ఐదు నెలల క్రితం కర్రెగుట్టల ప్రాంతంలో 21 రోజుల పాటు సుదీర్ఘమైన ఆపరేషన్ జరిగింది. 31 మంది మావోయిస్టులు మృతిచెందారు. ఛత్తీస్‌గఢ్, తెలంగాణ సరిహద్దుల్లోని ఈ కర్రెగుట్టలు మావోయిస్టులకు కోటగా ఉండేది. ఆ కోటను భద్రతా దళాలు బద్దలు కొట్టాయి. అబుజ్‌మాడ్ అడవుల్లో ఒకే దఫాలో భద్రతా బలగాలు సుమారు 50 గంటలకు పైగా కూంబింగ్ చేపట్టగా, ఎన్‌కౌంటర్ సంభవించి 27 మంది మావోయిస్టులు హతమయ్యారు. వీరిలో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి, సుప్రీం కమాండర్ నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు ఉన్నారు. ఈయన మరణాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా 'చారిత్రక విజయం'గా అభివర్ణించారు. తాజాగా ఛత్తీస్గఢ్లో జరిగిన ఓ ఎన్కౌంటర్లో పార్టీ ఒడిశా బాధ్యతలు నిర్వర్తిస్తున్న మోడెం బాలకృష్ణ మృతి చెందాడు. దీంతో ఒడిశాలో దాదాపు పార్టీ తీవ్రంగా నష్టపోయిందనే చర్చ నడుస్తున్నది. ఇలాంటి సందర్భంలో మావోయిస్టు పార్టీ చీఫ్ కమాండర్గా తిప్పర్తి తిరుపతి బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పుడు పార్టీ అంతర్మథనంలో పడినట్లు, సాయుధ పంథాపై పునరాలోచిస్తున్నట్లు తాజా పార్టీ అధికార ప్రతినిధి అభయ్పేరుతో విడుదలైన లేఖను పరిశీలిస్తే అర్థమవుతున్నది.

### - మాటల్లేవ్.. చర్చల్లేవ్..

**కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ చేపట్టిన తర్వాత పార్టీ అధికార ప్రతినిధి అభయ్ పేరుతో లేఖ విడుదల కావడం ఇది రెండో సారి. ఆయుధాలు విడిచి, సాయుధ పంథాను వదిలి ప్రభుత్వంతో చర్చలకు సిద్ధమని గతంలోనూ లేఖ విడుదలైంది. కానీ, కేంద్ర ప్రభుత్వంతో పాటు మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల్లో ఏ ప్రభుత్వమూ చొరవ తీసుకోలేదు. మావోయిస్టులతో చర్చల అంశాన్ని పట్టించుకోలేదు. తాజాగా విడుదలైన లేఖను సైతం ప్రభుత్వాలు పట్టించుకునే పరిస్థితిలో లేవు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే మాటల్లేవు.. చర్చల్లేవ్.. అని తెగేసి చెప్పేసింది. ఇప్పటికీ కేంద్ర ప్రభుత్వ వైఖరి అదే అన్నట్లు కనిపిస్తున్నది. ఇలాంటి సందర్భంలో మావోయిస్టు పార్టీ కొత్త నాయకత్వం ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుంది? సాయుధ పంథాపై ఎలాంటి విధానం అమలు చేయనున్నది..? మొదలైన అన్ని ప్రశ్నలకు పార్టీ నుంచి సమాధానం రావాల్సి ఉన్నది. మరోవైపు మావోయిస్టులతో ప్రభుత్వాలు చర్చలు జరపాలని మానవ హక్కుల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ముందుముందు ఏం జరగబోతుందనేది వేచి చూడాల్సిందే.**

## తుపాకీ వదిలేది లేదు..

### - మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ

**తాత్కాలిక సాయుధ పోరాట విరమణ, శాంతి చర్చల ప్రతిపాదనలు పార్టీ అధికారిక నిర్ణయం కాదని, అవి అతని వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమేనని మావోయిస్టు పార్టీ తెలంగాణ కమిటీ శుక్రవారం పార్టీ అధికార ప్రతినిధి అభయ్ అలియాస్ సోనూ ప్రకటనకు కౌంటర్ ఇచ్చింది. జగన్ పేరుతో లేఖ విడుదలైంది. లేఖలోని సారాంశం ఏంటంటే.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 'ఆపరేషన్ కగార్' పేరుతో తమ ఉద్యమాన్ని అణచివేసేందుకు హింసాత్మక చర్యలు చేపడుతోందని, ఈ క్రమంలో ప్రధాన కార్యదర్శితో పాటు పలువురు సీనియర్ నాయకులను కోల్పోయామని పేర్కొన్నారు. ఈ నష్టాలు వాస్తవమే అయినప్పటికీ, తాము పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తామని, వెనక్కి తగ్గేది లేదని ప్రకటనలో తేల్చి చెప్పారు. అభయ్ అనుసరించిన పద్ధతి పార్టీలో గందరగోళాన్ని సృష్టించిందని, ఇది ఉద్యమానికి నష్టం కలిగిస్తుందని ఆరోపించారు. ఎటువంటి పరిస్థితుల్లోనూ ఆయుధాలను విడిచిపెట్టేది లేదని, ప్రజలకు వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న బీజేపీకి వ్యతిరేకంగా పోరాటాలను కొనసాగిస్తామని ఉద్ఘాటించారు.**



# విద్యార్థులకు నూతన దుస్తుల పంపిణీ

## దసరా, బతుకమ్మ సందర్భంగా దాతల అందజేత

అక్షర దర్బార్, సంగెం: మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో దసరా, బతుకమ్మ పండుగల సందర్భంగా విద్యార్థులకు నూతన దుస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. తల్లిదండ్రులు లేని వారు, లేదా ఒక్క తల్లిదండ్రి ఆధారంగా జీవిస్తున్న విద్యార్థుల కోసం దాతల సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టారు. పాఠశాల ప్రిన్సిపాల్ నీలిమ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రాము మాట్లాడుతూ, విద్యార్థులకు సహాయం అందించడంలో దాతల పాత్ర ఎంతో ముఖ్యమని అభిప్రాయపడ్డారు. మాజీ ఎంపీపీ కందకట్ల కళావతి నరహరి మాట్లాడుతూ, ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఉత్సాహాన్ని నింపుతాయని, సమాజానికి ఉపయోగపడే విధంగా చదువుకొని ఎదగాలని విద్యార్థులు సంకల్పించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దాతలు కందకట్ల నరహరి, మెట్టిపల్లి రమేష్, కుంటపల్లి ఉమాశంకర్, బొజ్జ సురేష్, రౌతు శ్రీనివాస్, నూరు ఉపేందర్, సమాజ సేవకుడు పులి రాజశేఖర్, ఉపాధ్యాయులు పులి శిరీష, రేణుక, భవాని పాల్గొన్నారు.



# చల్లా పరామర్శ...

అక్షర దర్బార్, పరకాల: నడికూడ మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన కొనారి రఘువీరా రెడ్డి అనారోగ్యంతో మృతిచెందగా పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియచేసారు. అదేవిధంగా గ్రామంలో కొద్ది రోజులక్రితం మరణించిన పోగు సారయ్య (భగవంతుడు) కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పరామర్శించారు.మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని కుటుంబసభ్యులకు భరోసానిచ్చారు.



# మొలుగూరి పరామర్శ....

అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణం వెలమవాడలో దగ్గు సంపత్ రావు తల్లి దగ్గు గోపమ్మ మరణించగా వారి దశదిన కార్యక్రమానికి హాజరై వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన పరకాల మాజీ శాసనసభ్యులు మొలుగూరి బిక్షపతి. వారితో పాటు దగ్గు సంపత్ రావు, దగ్గు విజేందర్ రావు,దగ్గు గోపాల్ రావు, దగ్గు మాధవరావు, దగ్గు ప్రేమ్ చందర్ రావు, కటారి రవీందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భద్రత కోసమే కార్డెన్ సెర్చ్

## – కాటారం డీఎస్పీ సూర్యనారాయణ



అక్షర దర్బార్, కాటారం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొత్తపల్లిలో శుక్రవారం తెల్లవారు జామున 65 మంది సిబ్బందితో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. డీఎస్పీ సూర్యనారాయణ, సిఐ నాగార్జునరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో పత్రాలు లేని 12 బైక్‌లు, 40 లీటర్ల గుడుంబా, 600 లీటర్ల బెల్లం పానకం స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ "యువత చెడు వ్యసనాలకు బానిసలుకావొద్దు. గంజాయి రవాణా, విక్రయం, సేవనంపై కఠిన చర్యలు తీసుకుంటాం. సైబర్ నేరాలు, భూ గొడవలు, అక్రమ రవాణా విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి" అని హెచ్చరించారు. గుర్తు తెలియని వ్యక్తులు, అనుమానాస్పద కదలికలు గమనిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే ప్రజలు భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలని కోరారు.

## మేము వేసిన శిలాఫలకాల పక్కనే

# కొత్త శిలాఫలకాలు సిగ్గు చేటు

- కాంగ్రెస్ ఎమ్మెల్యే తీరు ప్రజలను మభ్య పెట్టడమే
- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

అక్షర దర్బార్, శాయంపేట: శాయంపేట మండలం కొప్పుల గ్రామంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే తాను నిధులు తెచ్చి పనులు ప్రారంభించిన ప్రాజెక్టులకు ప్రస్తుత ఎమ్మెల్యే శిలాఫలకాలు పెట్టడం ప్రజలను మభ్యపెట్టే చర్య అని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి విమర్శించారు.హుస్సేన్‌పల్లి–మైలారం



రహదారి కోసం రూ.1.60 కోట్లు, కొప్పుల–పరకాల బీటీ రోడ్డు, చలివాగుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.11.59 కోట్లు నిధులు తానే మంజూరు చేయించానని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయంగా పనులు ఆపేస్తోందని, చెరువులు, ఎస్సీలకు చెందిన స్మశాన వాటికలు కూడా ఆక్రమణకు గురవుతున్నాయని ఆరోపించారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పని చేసి అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆయన బైక్ ర్యాలీ నిర్వహించి కొప్పుల గ్రామంలో శిలాఫలకాలను పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతి రెడ్డి,బి ఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షులు మనోహర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ వంగాల నారాయణ రెడ్డి,పి ఏ సి ఎస్ వైస్ చైర్మెన్ దుదిపాల తిరుపతి రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ దాసి శ్రవణ్,మాజీ ఉప సర్పంచ్ దైనంపెల్లి సుమన్ ,బండ నారాయణ రెడ్డి, పెద్దిరెడ్డి ఆదిరెడ్డి, పసుల ప్రవీణ్, కుసుమ రమేష్, లక్ష్మణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

# జోనల్ స్థాయి క్రీడలు విజయవంతం



అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: మొగుళ్లపల్లి జోనల్ స్థాయి క్రీడోత్సవాలు విజయవంతంగా ముగిశాయని ఎస్జీఎఫ్ మొగుళ్లపల్లి జోన్ చైర్మన్, మండల విద్యాధికారి లింగాల కుమారస్వామి తెలిపారు. ఈ సందర్భంగా మొగుళ్లపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పింగిలి విజయపాల్ రెడ్డి మాట్లాడుతూ, "చదువు మరియు క్రీడలు విద్యార్థికి రెండు కళ్ల లాంటివి. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను సాధించగలరు" అని అన్నారు. ఎస్జీఎఫ్ జోన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గుండెల్లి రాజయ్య మాట్లాడుతూ, మొగుళ్లపల్లి, చిట్యాల, టేకుమట్ల మూడు మండలాల నుండి సుమారు 450 మంది విద్యార్థులు అండర్–14, అండర్–17 విభాగాలలో బాల, బాలికలుగా క్రీడల్లో పాల్గొన్నారని తెలిపారు. జోనల్ స్థాయిలో విజేతలైన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసి పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు సూదం సాంబమూర్తి, బొమ్మ సందీప్ రెడ్డి, సంగినేని పృథ్వీరాజ్, బండి ప్రసాద్, నూకల లింగయ్య, గాజర్ల శ్రీనివాస్, మహేష్, అజయ్, స్వరూపారాణి, చాగంటి ఆనంద్, సుమత, ఉమా, వెన్నెల, శారద, అశోక్, శ్రీనివాస్, సుదర్శన్, నరేష్, సంఘ రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

# 'స్వచ్ఛతే సేవా'లో భాగస్వాములుకండి

## బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాప్ రెడ్డి



అక్షర దర్బార్, నల్లబెల్లి: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా నిర్వహిస్తున్న ★"సేవా పక్షం"★లో భాగంగా నల్లబెల్లి మండలం 75వ బూత్‌లో స్వచ్ఛత కార్యక్రమం జరిగింది. మండల అధ్యక్షుడు తడుక వినయ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డా. గోగుల రాణా ప్రతాప్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, నాయకులతో కలిసి చీపురు పట్టి శుభ్రపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆరోగ్యకరమైన సమాజం కోసం స్వచ్ఛతే సేవా కార్యక్రమంలో భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి మోదీ పేదల సంక్షేమం, మహిళల సాధికారత, రైతులకు మద్దతు, యువతకు అవకాశాల కల్పనలో విశేష కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.



# గ్రామ-గ్రామాన నాణ్యమైన విత్తనం"

అక్షర దర్బార్, పరకాల: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో "గ్రామ–గ్రామాన నాణ్యమైన విత్తనం" కార్యక్రమం కింద, వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్తలు డా. వెంకన్న, డా. ఎల్. కృష్ణ, శాస్త్రవేత్తలు డా. భార్గవి, డా. పద్మజ బృందం శుక్రవారం నడికూడ మండలంలోని ముస్త్యాలపల్లి, నడికుడ గ్రామాల్లో వరి, కంది పంటల క్షేత్ర సందర్శన చేపట్టారు.రైతులకు విత్తనోత్పత్తి సాంకేతికత, సేంద్రియ ఎరువుల ప్రాధాన్యత, యూరియా వాడకం తగ్గింపు వంటి అంశాల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పోరిక జైసింగ్, విస్తరణ అధికారులు జనగం ప్రదీప్, సూత్రపు గోపీనాథ్, రైతులు పాల్గొన్నారు.

# దసరా సెలవుల్లో పిల్లలు జాగ్రత్త




అక్షర దర్బార్ నల్లబెల్లి : ఈనెల 21వ తారీకు నుండి రాష్ట్ర ప్రభుత్వం సెలవులు ప్రకటించిన సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు ఆటల కోసమై చెరువుల వెంట కాలువల వెంట తిరుగుతూ ప్రమాదానికి గురయ్యే అవకాశాలు ఉన్నాయని వారి తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్త వహించాలని నల్లబెల్లి ఎస్సై గోవర్ధన్ ఒక ప్రకటనలో తెలిపారు

# ఆర్వోబీ వంతెన పనుల్లో వేగం పెంచాలి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- కాజీపేట ఆర్ఓబీ పనుల పరిశీలన

అక్షరదర్బార్, కాజీపేట: కాజీపేటలో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ) నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ పనులను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శుక్రవారం స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాజీపేట ఆర్ఓబీ కింద ఇప్పటికే మొదటి వంతెన పనులు పూర్తికాగా, రెండో వంతెన నిర్మాణం కొంతమేర పురోగమించిందని తెలిపారు. రైల్వే అధికార్ల సూచనల మేరకు ఇనుప వంతెన నిర్మాణం చేపట్టామని తెలిపారు. ప్రజలకు రవాణా సౌకర్యాలు కల్పించేందుకు, ట్రాఫిక్‌ను తగ్గించేందుకు రెండో వంతెన పనులను వేగవంతం చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పనుల్లో ఎటువంటి ఆలస్యం జరుగకుండా చూడాలని, అనవసరమైన జాప్యాలను నివారించాలన్నారు. ఇదిలా ఉండగా, పాత వంతెన మరమ్మత్తు పనుల కోసం ప్రభుత్వం రూ.59 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులను సమర్థవంతంగా వినియోగించుకుని, వంతెనను మరింత సురక్షితంగా, వినియోగయోగ్యంగా మార్చాలని సంబంధిత ఇంజినీరింగ్ శాఖ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. స్థానికులు, సాంకేతిక అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పాత వంతెన వద్ద మరమ్మత్తు పనుల స్థితిగతులను ఆయన పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పని చేయాలని అన్నారు.





# స్పీకర్ నోటీసులకు జవాబిస్తా

- ఆ తర్వాత భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తా..
- నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్ ప్రభుత్వంతో కలసి పని చేస్తున్న
- ఎలాంటి పదవులు ఆశించలేదు.. అడుక్కోలేదు..
- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



అక్షరదర్బార్, హనుమకొండ : ఫిరాయింపు ఆరోపణలపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ జారీ చేసిన నోటీసులకు త్వరలో సమాధానం ఇస్తానని, ఆ తర్వాత భవిష్యత్తు కార్యాచరణ ఉంటుందని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తేల్చిచెప్పారు. ఎమ్మెల్యేల ఫిరాయింపుల గురించి బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలపై శుక్రవారం హనుమకొండలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. పదేళ్ల పాటు సాగిన బీఆర్ఎస్ పాలనలో 36 మంది ఎమ్మెల్యేలను తన పార్టీలో చేర్చుకుని, అందులో ఇద్దరికి మంత్రి పదవులు కూడా ఇచ్చారని గుర్తుచేశారు. అప్పుడు పార్టీ మారిన ఎమ్మెల్యేలెవరూ ఎందుకు రాజీనామా చేయలేదని ప్రశ్నించారు. నాడు ఆ పని చేయించకుండా ఇప్పుడు బీఆర్ఎస్ నేతలు ఫిరాయింపు ఎమ్మెల్యేలను ఎందుకు తప్పుగా చిత్రీకరిస్తున్నరని మండిపడ్డారు. రాజకీయాల్లో విలువలను దిగజార్చి ఫాంహౌస్‌లో విశ్రాంతి తీసుకుంటున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇతరులపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదమని అన్నారు. పార్టీ ఫిరాయించినందుకు తనపై వస్తున్న ఆరోపణలకు సమాధానమిస్తూ, తాను పదవుల కోసం ఎవరినీ బతిమలాడుకోలేదని అన్నారు. గతంలో తానేమీ అడగకపోయినా కేసీఆరే తనను ఢిల్లీ నుంచి పిలిపించి డిప్యూటీ సీఎంగా చేశారని గుర్తుచేశారు. పార్టీ మారడం వ్యక్తిగతంగా తనకు ఇష్టం లేకపోయినా, నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నానని తెలిపారు. ఎన్ని వ్యక్తిగత దూషణలు వచ్చినా వాటికి భయపడనని స్పష్టం చేశారు. తన రాజకీయ జీవితానికి స్టేషన్ ఘన్‌పూర్ ప్రజలే కారణమని కడియం శ్రీహరి కృతజ్ఞతలు తెలిపారు. గత 15 సంవత్సరాలుగా నియోజకవర్గానికి జరిగిన నష్టాన్ని పూడ్చేందుకు కృషి చేస్తున్నానని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహాయంతో అభివృద్ధి పనులను వేగవంతం చేశానని పేర్కొన్నారు. కేవలం 21 నెలల కాలంలోనే రూ.1,025 కోట్లకు పైగా నిధులు తెచ్చానని, తద్వారా నీటిపారుదల, విద్య, వైద్యం, విద్యుత్ రంగాల్లో అభివృద్ధి పనులు చేపట్టానన్నారు. దేవాదుల ప్రాజెక్టు పనుల ద్వారా నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి గోదావరి జలాలు అందించడమే తన లక్ష్యమని హామీ ఇచ్చారు. ఈ అభివృద్ధి అంతా కాంగ్రెస్ ప్రభుత్వం వల్లనే సాధ్యమైందని కొనియాడారు.

# బీసీలకు ఆ మూడు పార్టీలు మోసం

- బీసీలకు బడ్జెట్ లో రూ.లక్ష కోట్లు కేటాయించాలి
- టీఆర్పీ రాష్ట్ర అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న
- టీఆర్పీ వరంగల్ డిక్లరేషన్ విడుదల



అక్షరదర్బార్, హనుమకొండ: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా కామారెడ్డి డిక్లరేషన్ పట్టించుకోలేదని, బీసీలకు కాంగ్రెస్ సహా బీఆర్ఎస్, బీజేపీలు మోసం చేశాయని తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న ఆరోపించారు. హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్ లో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన వరంగల్ డిక్లరేషన్ ను ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాము పది అంశాలను ఎజెండాగా పెట్టుకుని ముందుకు పోతున్నామన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ ను జాతిపితగా గుర్తించాలని నిర్ణయించామన్నారు. బీసీలకు ప్రతి సంవత్సరం లక్ష కోట్లు బడ్జెట్ ను ప్రభుత్వం కేటాయించాలని, లేదంటే అధికారంలోకి వచ్చిన తరువాత కేటాయిస్తామన్నారు. అలాగే కొండా లక్ష్మణ్ బాపూజీకి భారతరత్న ఇవ్వాలని రెండో అంశంగా పెట్టుకున్నామన్నారు. జనాభా దామాషా ప్రకారం విద్యా, వైద్యం తదితర రంగాల్లో రిజర్వేషన్ పెట్టాలని కామన్ మినిమంలో పెట్టామన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ ప్రతి సంవత్సరం 20 వేల కోట్లు ఖర్చుచేస్తామని చెప్పి కనీసం రెండువేల కోట్లు కూడా ఖర్చు పెట్టలేదన్నారు. గడిచిన రెండేండ్ల కాలంలో కాంగ్రెస్, గత పదేళ్ల కాలం అధికారంలో ఉన్న బీఆర్ఎస్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ బీసీలను మోసం చేశాయన్నారు. బీసీలలో భూమిలేని కుటుంబాలు 18 లక్షలు ఉన్నాయన్నారు. తాము అధికారంలోకి వస్తే భూమి లేని బీసీలకు రెండు ఎకరాల భూమి ఇస్తామన్నారు. విద్య, ఉద్యోగ రంగాల్లో జనాభా దామాషా ఆధారంగా రిజర్వేషన్లు కల్పిస్తామన్నారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేస్తామన్నారు. ప్రతి ఒక్కరికీ ఉచిత విద్య, వైద్య సేవలు కార్పొరేట్ స్థాయిలో అందిస్తామని, మహిళకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. వరంగల్ ను రెండో రాజధానిగా తాము అధికారంలోకి వస్తే చేస్తామన్నారు. రాష్ట్రంలో బీసీలను, బీసీ ఉద్యోగులను అణచివేయాలని చూస్తే ఊరుకోమన్నారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో పార్టీ తరపున పోటీ చేస్తామన్నారు. ఈ విలేఖరుల సమావేశంలో టీఆర్పీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్స్ ఎం రజినీ కుమార్ యాదవ్, హరిశంకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి వట్టెం జానయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# తొర్రూర్ పీఏసీఎస్ లో అవకతవకలు

- రుణాల రికవరీ వైఫల్యం, నాబార్డ్ నిబంధనల ఉల్లంఘన ఆరోపణలు
- చైర్మన్ తో సహా కమిటీ సభ్యుల తొలగింపు
- పర్సన్ ఇన్చార్జ్ గా అసిస్టెంట్ రిజిస్ట్రార్ రమేష్ నియమాకం

అక్షరదర్బార్, మహబూబాబాద్: మహబూబాబద్ జిల్లా తొర్రూర్ ప్రైమరీ అగ్రికల్చర్ కో-ఆపరేటివ్ సొసైటీ (పీఏసీఎస్)లో ఆర్థిక అవకతవకలు వెలుగులోకి రావడంతో ఉన్నతాధికారులు శుక్రవారం చైర్మన్ కాకిరాల హరిప్రసాద్‌తో సహా ప్రస్తుత కమిటీని తొలగించింది. జిల్లా సహకార అధికారి సమర్పించిన నివేదిక ప్రకారం.. కమిటీ రుణాలను వసూలు చేయడంలో విఫలమవడమే కాకుండా, నాబార్డ్ మార్గదర్శకాలకు విరుద్ధంగా అధిక వ్యయానికి పాల్పడింది. ఆడిట్ నివేదికల్లోని లోపాలను సరిదిద్దకపోవడం, వార్షిక బడ్జెట్‌ను సిద్ధం చేయకపోవడం వంటి వైఫల్యాలు వెలుగు చూశాయి. కమిటీ సభ్యుల్లో కొందరు రుణ ఎగవేతదారులు ఉండటాన్ని ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణి ంచారు. ఈ కారణాలతో కమిటీపై వేటు వేశారు. కమిటీ స్థానంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ రమేష్‌ను పర్సన్-ఇన్-చార్జ్‌గా నియమించారు.

# వరంగల్ లో జోయాలుక్కాస్ బ్రిలియన్స్ డైమండ్

- జ్యువెలరీ షో ప్రారంభం




అక్షరదర్బార్, వరంగల్: జోయాలుక్కాస్ నిర్వహించే ప్రతిష్టాత్మక బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో ఈ నెల 19 నుంచి వరంగల్‌ను కనువిందు చేయనుంది. తన వైభవానికి, కళాత్మకతకు పేరుగాంచిన ఈ ప్రత్యేక ప్రదర్శన, ఆభరణ ప్రియులకు పరిమిత ఎడిషన్ వజ్రాలు, విలువైన ఆభరణాల సేకరణలను అన్వేషించే అరుదైన అవకాశాన్ని అందిస్తుంది. ఈ షోలో అద్భుతమైన బ్రైడల్ సెట్ల నుంచి ప్రతిరోజూ ధరించదగిన సమకాలీన ఆకర్షణీయమైన ఆభరణాల వరకు, సనాతన సంప్రదాయాన్ని ఆధునిక సౌందర్యంతో కలిపిన కళాఖండాలు ఉన్నాయి. ఈ సందర్భంగా జోయాలుక్కాస్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ జోయ్ ఆలుక్కాస్ "వరంగల్ ఎప్పుడూ అద్భుతమైన ఆభరణ సెంటర్‌గా నిలిచి వచ్చింది 'బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షోతో, మేము సౌందర్యం, నైపుణ్యం అత్యున్నత అనుభూతిని ప్రతిబింబించే సేకరణను ప్రదర్శించాం. ప్రత్యేక లాంచ్ ఆఫర్ క్రింద, కొనుగోలుదారులు బంగారం, కట్ చేయబడిన, కట్ చేయని వజ్రాలు, విలువైన రత్నాలు, ప్లాటినం, వెండి నగలపై మేకింగ్ ఛార్జీలు (వీఏ)పై 50% తగ్గింపు పొందుతారు. ఈ ప్రదర్శన జోయాలుక్కాస్ వరంగల్ షోరూంలో నిర్వహించబడుతుంది. ఇది అక్టోబర్ 5 వరకు మాత్రమే.




# మీ గొంతుక! మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915